క్లుప్తంగా

ఫుడ్ ప్రాసెసింగ్ సెక్రటరీని కలిసిన కలెక్టర్



యువరాజ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కలెక్టర్, జేసీ

తిరుపతి అర్బన్: ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ ఫుడ్ ప్రాసెసింగ్ సెక్రటరీ ఎన్.యువరాజ్(ఐఏఎస్)ను తిరుపతిలోని ఓ ప్రైవేటు హోటల్‌లో గురువారం రాత్రి మర్యాద పూర్వకంగా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ కలిశారు.

చిట్టి చేతులు.. గట్టి చేతలు



సేవ్ వయనాడ్ అంటూ ప్లకార్డు ప్రదర్శిస్తున్న రెడ్ చెర్రీస్ విద్యార్థులు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కేరళ రాష్ట్రంలోని వయనాడ్ జిల్లా అతలాకుతలం అవడం విదితమే. ఈ భారీ వర్షాలకు పలువురు మృత్యువాత పడగా, గల్లంతైన వారి ఆచూకీ ఇప్పటికీ లభించలేదు. పెద్ద మొత్తంలో ఆస్తి నష్టం సంభవించింది. దీంతో తమవంతు సాయం అందించేందుకు రెడ్ చెర్రీస్ పాఠశాల విద్యార్థులు ముందుకొచ్చారు. అలాగే సేవ్ వయనాడ్ అంటూ ప్లకార్డులు చేతబట్టి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే ప్రయత్నం చేపట్టారు. దీంతో విద్యార్థుల ప్రయత్నాన్ని పలువురు అభినందించారు.

గ్రామాభివృద్ధిలో పంచాయతీలే కీలకం

డీఎల్‌పీఓ రూపారాణి



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ రూపారాణి

భాకరాపేట : గ్రామాభివృద్ధిలో పంచాయతీలే కీలకమని డీఎల్‌పీఓ రూపారాణి అన్నారు. గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారం చిన్నగొట్టిగల్లు జగనన్న సమావేశ మందిరంలో డీఎల్‌పీఓ ప్రారంభించి మాట్లాడారు. గ్రామ పంచాయతీ విధులు, బాధ్యతలు, జీపీడీపీ, 15వ ఆర్థిక ప్రణాళిక నిధులు–వ్యయంపై అవగాహన కల్పించారు. గ్రామ స్థాయి నుంచి పరిశుభ్రత, మంచి నీటి సరఫరా ఇత్యాది అంశాల్లో పంచాయతీల పాత్ర చాలా కీలకం అన్నారు. చెత్త సేకరణ, పొడిచెత్త, తడిచెత్తలను వేరు చేయడం, వర్మీ కంపోస్టు తయారీ, మార్కెటింగ్ మొదలైన వాటిపై చర్చించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సోమశేఖర్‌రెడ్డి, ఈఓపీఆర్‌డీలు, గ్రామ సర్పంచులు, పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

తిరుమల వీజీవో బాధ్యతల స్వీకరణ



సురేంద్ర

తిరుమల : తిరుమల వీజీవోగా ఏ.సురేంద్ర గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు వీజీవోగా పనిచేస్తున్న నందకిషోర్ తిరుపతి వీజీవోగా నియమితులయ్యారు. నూతన వీజీవో మాట్లాడుతూ.. శ్రీవారి సన్నిధిలో పనిచేయడం పూర్వజన్మ సుకృతమని భావిస్తున్నట్టు చెప్పారు. దేశ, విదేశాల నుంచి స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన రక్షణ, రద్దీ నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

తిరుపతి సిటీ: తిరుపతి టాటా క్యాన్సర్ ఫౌండేషన్ సహకారంతో స్థానిక కరకంబాడి రోడ్డులోని ఎస్వీసీతఈ కళాశాలలో క్యాన్సర్‌పై రెండు రోజుల అవగాహన సదస్సు గురువారం ప్రారంభించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.సుధాకర్‌రెడ్డి, ఎస్వీసీసీఏఆర్ వైద్యులు డాక్టర్ పి.నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. క్యాన్సర్ వ్యాధి కారకాలు, లక్షణాలు, నివారణ చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ఎంబీఏ, బీటెక్ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నగరం దాటని మురుగు









తిరుపతిలో రెండు రోజుల క్రితం కుండపోత వర్షం కురిసింది. గడచిన వారం రోజులుగా తరచూ వర్షం కురుస్తూనే ఉంది. వర్షపు నీటి మూలాన నగరంలోని కొన్ని ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వర్షపునీరు నగర శివారు ప్రాంతమైన ఆటోనగర్, కొరమేనుకుంట, గొల్లవానిగుంట, కట్టకిందపల్లె తదితర ప్రాంతాలను ముంచెత్తింది. కొన్ని ప్రాంతాలు ఇప్పటికీ జల దిగ్బంధంలోనే ఉన్నాయి. ఆటోనగర్ ప్రాంతంలోని కొన్ని వీధులు బురద నీటితో అధ్వానంగా మారాయి. మురుగు నీటిని నగరం దాటించడంలో అధికారులు విఫలమయ్యారు. రెండు రోజులవుతున్నా ఎక్కడ వ్యర్థాలు అక్కడే నిలిచిపోయాయి. అధికారులు ఇప్పటికైనా దృష్టి సారించి మురుగు నీటిని నగరం దాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

-తిరుపతి తుడా

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- నగర కమిషనర్ మౌర్య



మాట్లాడుతున్న నగర కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా: నగర శుభ్రత, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, అధికారులు, ఉద్యోగులు సమన్వయ కృషి చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పిలుపునిచ్చారు. ఆ దిశ అందరం ముందడుగు వేస్తే ప్రజలు మన వెంట నడుస్తారని, దీనిని దృష్టిలో ఉంచుకుని జవాబుదారీతనంతో విధులు నిర్వర్తించాలని హితోపదేశం చేశారు. నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయాల అమెనిటీ సెక్రటరీలు, శానిటరీ సెక్రటరీలు, టౌన్ ప్లానింగ్ సెక్రటరీ, హెల్త్ సెక్రటరీలతో పాటు ఆయా విభాగాధిపతులతో గురువారం కచ్చపి ఆడిటోరియంలో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఆయా విభాగాల సెక్రటరీల పరిధి, చేయాల్సిన పనుల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, అన్ని విభాగాల సెక్రటరీలు కలసి మెలసి పని చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సచివాలయ రోజూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. ఇంటింటికీ వాహనాలు వెళ్లి చెత్త సేకరించేలా శానిటరీ సెక్రటరీలు పర్యవేక్షించాలన్నారు. టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, సిబ్బంది నగరంలో ఎక్కడా భవన నిర్మాణ వ్యర్థాలు లేకుండా చూడాలని, అనధికారిక నిర్మాణాలు, ఫ్లెక్సీలు, హోర్డింగులు లేకుండా చూడాలని ఆదేశించారు. నగరంలో డ్రెయిన్లు, ప్రజలకు అవసరమైన రోడ్లు, గుంతలు లేకుండా చేయడం, నిర్దిష్ట సమయంలో ప్రతి ఒక్కరికీ నీరు అందేలా అమెనిటీ సెక్రటరీలు చూడాలన్నారు.

హెల్త్ క్లినిక్స్‌లో వైద్య సిబ్బంది అన్ని వైద్య సదుపాయాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డెప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్ వెంకట్రామిరెడ్డి, డీఈలు విజయకుమార్ రెడ్డి, సంజయ్ కుమార్, నరేంద్ర, మహేష్, శ్రావణి, రాజు, హెల్త్ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, డీసీపీ శ్రీనివాసులు రెడ్డి, ఏసీపీ బాల సుబ్రమణ్యం, మేనేజర్ చిట్టిబాబు, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి తదితరులు పాల్గొన్నారు.

గుడి స్థలంతో జయమ్మకు సంబంధం లేదు

- కబ్జా చేయాలనే గ్రామస్తులపై ఆరోపణలు
- విశ్రాంత డీఈ రామదాసు
- కబ్జారాయుళ్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి: గ్రామస్తుల డిమాండ్



కబ్జారాయుళ్లపై చర్యలు తీసుకోవాలని రామాలయం వద్ద డిమాండ్ చేస్తున్న కాలూరు గ్రామస్తులు

తిరుపతి రూరల్: దేవదాయశాఖ ఆధ్వర్యంలో కాలూరులో నిర్మిస్తున్న రాముల వారి ఆలయానికి జయమ్మకు సంబంధం లేదని, గ్రామస్తులంతా కలిసి 76 ఏళ్ల క్రితమే ఆలయాన్ని నిర్మించినట్లు విశ్రాంత డీఈ రామదాసు తెలిపారు. గురువారం కాలూరులోని రాములవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గ్రామస్తులతో కలిసి ఆయన మాట్లాడారు. 1948లో స్వర్ణముఖి నది ఉధృతికి కొట్టుకువచ్చిన కలపను నాటి గ్రామ యువకులందరూ కలిసి విక్రయించారని, నాడు వచ్చిన రూ.150 లను గ్రామంలో చీటీ నిర్వహించి, రెండు, మూడేళ్ల తర్వాత వచ్చిన పెద్ద మొత్తంతో గ్రామస్తులు సంయుక్తంగా రామాలయం నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆ సమయంలో గుడి నిర్మాణానికి స్థలం లేకపోవడంతో తమ పెదనాన్న శ్యామల క్రిష్టయ్య ఇంటి స్థలాన్ని ఇచ్చామన్నారు. దీంతో 1948లో రాములవారి ఆలయాన్ని నిర్మించినట్లు చెప్పారు. అప్పటికీ జయమ్మకు కేవలం ఎనిమిది ఏళ్లు మాత్రమేనని, పూతలపట్టులోని అత్తగారి ఊరు నుంచి బతుకుదెరువు కోసం కాలూరుకు వచ్చిన ఆమెకు నివాసం ఉండేందుకు నాడు కేవలం 12 అంకణాల స్థలం మాత్రమే ఉందని గుర్తు చేశారు. శిథిలావస్థకు చేరిన రామాలయాన్ని జీర్ణోద్ధరణ చేసేందుకు రూ.29.60 లక్షలు మంజూరు అయ్యాయని, గుడి నిర్మాణం కూడా 80శాతం పూర్తి అయిన తర్వాత జయమ్మ బంధువులు గుడి నిర్మాణాన్ని అడ్డుకోవడం శోచనీయమన్నారు. తమ పెదనాన్న స్థలంలో 76 ఏళ్ల క్రితం నిర్మించిన గుడిని తామే దానం చేసినట్లు జయమ్మ బంధువులు చెప్పడం విడ్డూరంగా ఉందని, ఈ దుష్ప్రచారానికి స్వస్తి పలకకపోతే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గ్రామస్తుల ఆందోళన

రాజకీయ ప్రోద్బలంతో రాములవారి ఆలయ నిర్మాణాన్ని అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని కాలూరు గ్రామస్తులు గురువారం ఆలయం వద్ద ఆందోళన చేశారు. 76 ఏళ్ల క్రితం నిర్మించిన ఆలయానికి ఇప్పుడు టీడీపీ నేతల పేరు చెప్పి కబ్జా చేయాలని చూస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

సత్య ఇన్ఫోటెక్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



వీసీ అప్పారావుకు వినతి పత్రం ఇస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

తిరుపతి సిటీ: సత్య ఇన్ఫోటెక్ యాజమాన్యాల ఆగడాలు రోజురోజుకూ శృతి మించిపోతున్నాయని వెంటనే ఆ సంస్థపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఇదే విషయమై గురువారం ఎస్వీయూ వీసీ డాక్టర్ అప్పారావును కలసి వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ, ఇంటర్న్‌షిప్ పేరుతో ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించి సర్టిఫికెట్లు ఇస్తామని విద్యార్థులను మభ్యపెట్టి, ఒక్కొక్కరి వద్ద రూ.4వేల నుంచి రూ.8వేల వరకు వసూలు చేస్తున్నారని, తరగతులు నిర్వహించడం లేదన్నారు. కేవలం నగదు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ధృవపత్రాలను ఇవ్వడం దారుణమన్నారు. ఎస్వీయూ పరిధిలో ప్రైవేటు, ప్రభుత్వ కళాశాలలను వేదికగా చేసుకుని ఆ సంస్థ యాజమాన్యం విద్యార్థులను మోసం చేస్తోందని, దీనిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో దళిత విద్యార్థి సేన వ్యవస్థాపకుడు యుగంధర్, ఎస్వీయూ వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షులు మన్నం ప్రేమ్‌కుమార్, బీడీఎస్ సంఘం నాయకులు జేడీ ప్రసాద్, ఏపీ వీహెచ్‌ఎస్ జిల్లా నాయకులు రూపేష్, ముని, నరేష్, సాయి, దినేష్ తదితరులు పాల్గొన్నారు

న్యాయమూర్తుల చొరవతో..!



గదుల ముందు ఏర్పాటు చేసిన పందిరి

తిరుపతి లీగల్ : న్యాయమూర్తుల చొరవతో సిబ్బందికి సౌకర్యాలు మెరుగు పడ్డాయి. వివరాలు.. ప్రస్తుతం తిరుపతి కోర్టు ఆవరణలో కొన్ని కోర్టుల సిబ్బంది కూర్చుని తమ విధులు నిర్వర్తించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సిబ్బందికి కోర్టు ఆవరణలో గతంలో రెండు కారు షెడ్లను విధులు నిర్వహించుకోవడానికి కేటాయించారు. దీంతో ఆ కోర్టు కేసు కట్టలను, క్రిమినల్ కేసులకు సంబంధించిన ప్రాపర్టీని, ఇతర విలువైన పత్రాలను ఆ రెండు(షెడ్లు) గదుల్లోనే భద్రపరుస్తూ విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే వర్షం కురిస్తే ఆ రెండు గదులకు వర్షపు నీటి జల్లు పడుతుండడంతో కేసు కట్టలను, విలువైన పత్రాలను కాపాడుకోవడానికి సిబ్బంది అగచాట్లు పడాల్సి వచ్చేది. ఇది గమనించిన మూడవ అదనపు జిల్లా జడ్జి ఏం గురునాథ్, 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ స్పందించారు. కోర్టు రెండు గదుల ముందు టెంకాయ కీతులతో పందిరి వేసుకోవడానికి అనుమతించారు. దీంతో సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి తన సిబ్బంది సహకారంతో పందిరి ఏర్పాటు చేశారు. దీంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు వర్షపు జల్లు పడకుండా కేసు కట్టలను సిబ్బంది కాపాడుకుంటున్నారు.

రక్తదానం చేస్తే మరొకరికి పునర్జన్మ

- ఎస్పీడబ్ల్యూ కాలేజీ ప్రిన్సిపల్ నారాయణమ్మ



రక్తదానం చేస్తున్న విద్యార్థినులతో ప్రిన్సిపల్, అధికారులు, అధ్యాపకులు



రక్తదానం చేస్తున్న మహిళా వర్సిటీ విద్యార్థినులు

తిరుపతి సిటీ: రక్తదాతలు ప్రాణదాతలతో సమానమని, ఆపత్కాలంలో యువత రక్తదానం చేస్తే మరొకరికి పునర్జన్మ ఇచ్చినట్లేనని ఎస్పీడబ్ల్యూ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి. నారాయణమ్మ పిలుపునిచ్చారు. గురువారం పద్మావతి డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, కేంద్ర జీఎస్టీ అండ్ కస్టమ్స్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో కళాశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ, విద్యార్థినులలో సమాజసేవ చేసే సంకల్పం బలంగా ఉండాలన్నారు. ప్రతి రక్తపు బొట్టు మరొకరి ప్రాణాన్ని నిలుపుతుందనే విషయాన్ని యువత గుర్తించాలన్నారు. అనంతరం శిబిరంలో 40మందికిపైగా విద్యార్థినులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో స్విమ్స్ మెడికలాఫీసర్ డాక్టర్ శిల్ప, కమిషనర్ ఆఫ్ కస్టమ్స్ సాధు నరసింహారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ విజయ్ భాస్కర్, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ కృష్ణవేణి, దివ్యవాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో..

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ ఎన్ఎస్ఎస్, కస్టమ్స్ ప్రివెంటీవ్ విభాగం ఆధ్వర్యంలో వర్సిటీ హెల్త్ సెంటర్‌లో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్టూడెంట్స్ ఎఫైర్స్ డీన్ జే.కాత్యాయని, అసిస్టెంట్ కమిషనర్ కస్టమ్స్ సి.విజయభాస్కర్ ప్రారంభించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, యువతకు ఇదో విశిష్ట అవకాశమని వారు చెప్పారు. అనంతరం దాదాపు 30మంది విద్యార్థినులు రక్తదానం చేశారు. వారిని అధికారులు అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ అనన్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ నీరజ, బి.సుజాత, శాంతి, భార్గవి, సునీత, పద్మ, వైశాలి, హేమలత, దివ్య పాల్గొన్నారు.

3,500 యూనిట్ల రక్త సేకరణే లక్ష్యం

- తిరుపతి సెంట్రల్ జీఎస్టీ కమిషనరేట్ జాయింట్ కమిషనర్ హరిహరన్



సీజీఎస్టీ కమిషనరేట్ కార్యాలయంలో రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

తిరుపతి రూరల్: తిరుపతి సెంట్రల్ జీఎస్టీ కమిషనరేట్ పరిధిలో గురువారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించిందని జాయింట్ కమిషనర్ హరిహరన్ తెలిపారు. చిత్తూరు, తిరుపతి, కడప, కర్నూలు, నంద్యాల, అనంతరం, అన్నమయ్య, సత్యసాయి జిల్లాల్లో నిర్వహించిన ఈ శిబిరాల్లో 450 మంది ఉద్యో గులు, సిబ్బంది రక్తదానం చేసినట్లు ఆయన చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే విభాగాల్లోనే మొదటిసారిగా 3,500 యూనిట్ల రక్త సేకరణే లక్ష్యంగా ఈ మెగా శిబిరం నిర్వహి స్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో అన్ని జిల్లాలోనూ ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. రక్తదానం చేసిన ఉద్యోగులను, సిబ్బందిని ఆయన అభినందించారు. వారికి సర్టిఫికెట్లను అందజేశారు. తిరుపతిలో రుయా రక్తనిధి వైద్య బృందం రక్తసేకరణ చేసింది. కార్యక్రమంలో సీజీఎస్టీ సహాయ కమిషనర్ జగన్నాథ ప్రసాద్, జగన్‌నాయక్, బాలకృష్ణ, మదన్‌మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

సాగర్ అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

తిరుపతి(అలిపిరి): వినాయకసాగర్‌లో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని తిరుపతి వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాసులు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులను కోరారు. గురువారం కమిటీ సభ్యులతో కలిసి ఆయన ఎమ్మెల్యేను కలిసారు. తిరుపతి ప్రజల కోరిక మేరకు వినాయకసాగర్ మధ్యలో 90 అడుగుల నాట్య గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేయించాలని, వచ్చేనెల వినాయక చవితికి తగిన ఏర్పాట్లను పూర్తి చేయించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రియురాలిని మోసం చేసిన ప్రియుడు అరెస్ట్

తిరుపతి క్రైమ్: పెళ్లి చేసుకుంటానని నమ్మించి మరో అమ్మాయి మెడలో తాళి కట్టడానికి సిద్ధమైన ఓ ప్రబుద్ధుడిని పోలీసులు అరెస్ట్ చేసిన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. అలిపిరి ఇన్‌చార్జ్ సీఐ జయనాయక్ తెలిపిన వివరాలు.. నగరంలోని ఓ హాస్పిటల్లో విజయ్ కుమార్, నూర్జహాన్ ల్యాబ్ టెక్నీషియన్లుగా పనిచేస్తున్నారు. వీరి మధ్య చనువు పెరిగి దగ్గరయ్యారు. ఇద్దరూ కలిసి చెన్నారెడ్డి కాలనీలో ఒకే గదిలో నివాసం ఉండేవారు. అంతేకాకుండా విజయ్ కుమార్ ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. అయితే మరో మహిళను పెళ్లి చేసుకుంటున్నట్లు తెలుసుకున్న నూర్జహాన్ తన ప్రియుడిపై అలిపిరి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. గురువారం అతడిని అరెస్ట్ చేశారు. ఇందులో ట్విస్ట్ ఏమిటంటే.. విజయకుమార్‌కు గూడూరులో గురువారం రాత్రి రిసెప్షన్, శుక్రవారం ఉదయం పెళ్లి జరగాల్సి ఉంది. అరెస్ట్‌తో పెళ్లి కథ కంచికి చేరింది.

ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. మండలంలో మొత్తం 60 స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య పడిపోవడంతో మూడు స్కూళ్లను మూసివేశారు. మిగిలిన 57 స్కూళ్లలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో విద్యార్థుల తల్లిదండ్రుల పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మొత్తం 10 హైస్కూళ్లు, ఒక అప్పర్ ప్రైమరీ, 46 ప్రైమరీ స్కూళ్లకు ఎన్నికలు నిర్వహించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఎన్నికలను పర్యవేక్షించారు.

పాకాలలో..

పాకాల : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని ఎంఈఓ బాబ్జి తెలిపారు. గురువారం మండలంలోని 54 ఎంపీపీ, 4 ఎంపీయూపీ, 6 ఉన్నత పాఠశాలల్లో ఈ ఎన్నికలు నిర్వహించారు. ఆయా స్కూళ్లలో విద్యార్థుల తల్లిదండ్రులకు ఎన్నికలు నిర్వహించి, చైర్మన్, వైస్ చైర్మన్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఆయా స్కూళ్ల హెచ్ఎంలు నూతన కమిటీలతో ప్రతిజ్ఞ చేయించారు. చేయించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తుంబువానిగుంటలో..

తిరుపతి తుడా: తిరుపతిలోని శివజ్యోతి నగర్, తుంబువానిగుంట మున్సిపల్ హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన పేరెంట్స్ కమిటీలో కదిరి రాజేంద్ర పాఠశాల చైర్మన్‌గా రెండోసారి ఎంపికయ్యారు. తనవంతుగా స్కూల్ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం సుజాత, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రఘునాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్కావెంజర్ల కమిటీకి దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్: మాన్యువల్ స్కావెంజర్ల జిల్లా సర్వే కమిటీ ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కమిటీలో నలుగురు సభ్యులు ఉంటారని, వారిలో మాన్యువల్ స్కావెంజర్లు లేదా పారిశుద్ధ్య కార్మికుల కోసం పనిచేసే స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఇద్దరు, మాన్యువల్ స్కావెంజర్లు లేదా పారిశుద్ధ్య కార్మికులు ఇద్దరు ఉంటారని వెల్లడించారు. వారిలో ఒకరు మహిళా సభ్యురాలు ఉండాలని స్పష్టం చేశారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 12వ తేదీలోపు కలెక్టరేట్‌లోని జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారిత అధికారి కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వాలని కోరారు. అదనపు సమాచారం కోసం 6301101354 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

డీఎస్పీకి టాస్క్‌ఫోర్స్ వీడ్కోలు సత్కారం



టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ చెంచుబాబును సత్కరిస్తున్న ఎస్పీ శ్రీనివాస్

తిరుపతి మంగళం : టాస్క్ ఫోర్స్ డీఎస్పీ జి. చెంచుబాబు బదిలీ కావడంతో ఆ విభాగం అధికారులు, సిబ్బంది గురువారం రాత్రి టాస్క్ ఫోర్స్ కార్యాలయంలో ఆయనను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ.శ్రీనివాస్ శాలువ కప్పి, జ్ఞాపిక అందజేశారు. ఆయన సేవలను ప్రస్తుతించారు. ఏసీఎఫ్ శ్రీనివాస్, ఆర్ఐలు సురేష్ కుమార్ రెడ్డి, చిరంజీవులు, కృపానంద, సీఐలు శ్రీనివాసులు, సురేష్ కుమార్, ఆర్ఎస్ఐలు డీఎస్పీని సత్కరించారు.

ఏకపక్షంగా టీచర్ల సర్దుబాటు నిర్ణయం సరికాదు

తిరుపతి ఎడ్యుకేషన్ : టీచర్లను సర్దుబాటు చేస్తూ ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం సరికాదని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బాలాజీ, జీవి.సత్యనారాయణ ఓ ప్రకటనలో విమర్శించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఉపాధ్యాయ సంఘాల సమన్వయ సమావేశం నిర్వహించి, క్షేత్ర స్థాయిలో అభిప్రాయాలను తీసుకోవాలని, అయితే అంతకంటే ముందే ఉద్యోగోన్నతుల ప్రక్రియకు పూనుకుని సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. సర్దుబాటు చేయడానికి ఉపాధ్యాయులు లేని పక్షంలో అకడమిక్ విద్యావలంటీర్లను నియమించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా హిందీ టీచర్లను కూడా నియమించాలన్నారు.

నేడు ఆదివాసీ దినోత్సవం

తిరుపతి అర్బన్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శుక్రవారం ఉదయం 10 గంటలకు బైరాగిపట్టెడ ప్రాంతంలోని గిరిజన భవన్‌లో నిర్వహించనున్నామని జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిత అధికారి సూర్యనారాయణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.